


కృష్ణ ఆఫీసు నుండి యింటికొచ్చేసరికి సరిగ్గా ఆరయింది. స్కూటర్ వరండాలో 'పార్క్' చేసి లోపలికి వెళ్ళేసరికి అరుణ నవ్వుతూ కాఫీ గ్లాసుతో రడీగా నిల్చుంది.

"ఏమిటి విశేషం?" అంటూ కుర్చీలో కూర్చున్నాడు కృష్ణ.

"పోటీలో గెల్చిన కథ కాపీ యీ రోజే వచ్చింది" అంది కాఫీ అందిస్తూ అరుణ.

"ఐ సీ" అంటూ కాఫీ సిప్ చేయ సాగాడు కృష్ణ హుషారుగా.

"ఈసారి మామూలు చీరైతే నేనొప్పుకోను. ఖరీదైన పట్టుచీర కొనాలంతే" అంటూ పక్కను కూర్చుంది అరుణ.

"ఓ. కే! గ్రాంటెడ్ మై డియర్" చిలిపిగా నవ్వాడు కృష్ణ. తర్వాత ముఖం కడుక్కొని ఆ పత్రిక తీసి తనకథ చదివాడు. ఆ కథకి బాపు వేసిన బొమ్మ తనకెంతో నచ్చింది. మిగతా కథలు కూడా చదివేసి ఎదురుగా వున్న టీపాయ్‌మీద కాళ్ళు చాచి ఓ సిగరెట్ వెలిగించాడు. ఇంతలో బయట తలుపు దగ్గర ఎవరో చిన్నగా దగ్గారు. తల ఎత్తి చూస్తే రామారావు నవ్వుతూ నిల్చున్నాడు.

"రండి లోపలికి రండి ఫరవాలేదు" అంటూ పిల్చాడు కృష్ణ అతన్ని.

రామారావు మొహమాటంగా లోపలికొచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఇతను ఎలిమెంటరీ స్కూలు టీచరు. ఓ చిన్న సయిజు రచయిత కూడా. అప్పుడప్పుడూ తన కథలగురించి చర్చించడానికి కృష్ణదగ్గరికి వస్తుంటాడు.

"పోటీలో గెల్చిన మీ కథ చదివాము. చాలా బావుంది" అన్నాడు రామారావు.

అలవాటుపడ్డ ఆ వాక్యాలు విని నవ్వాడు కృష్ణ హుందాగా.

"ఈ మధ్య మీరేమయినా రాశారా?" అడిగాడు కృష్ణ.

"అవునండీ. దాని గురించి మాట్లాడదామనే వచ్చాను" అంటూ జేబులోంచి మడత పెట్టి ఉన్న కొన్ని కాగితాలు తీశాడు రామారావు.

"ఈ మధ్య ఆ కొత్త వీక్లీ పోటీల గురించి ప్రకటన చదివే వుంటారు. ఆ కథలపోటీ దృష్టిలో వుంచుకుని రాశాను. దీన్ని చదివి మీ అభిప్రాయం చెప్పాలి" అని ఆ కాగితాన్ని కృష్ణ చేతిలో పెట్టాడు రామారావు.

"ఆ ప్రకటన నేను చూడలేదు. నిబంధనలన్నీ మామూలేగా" మామూలుగా అడిగాడు కృష్ణ.

"అన్నీ మామూలే! కాని రాజకీయాల్ని దృష్టిలో ఉంచుకుని రాయాలన్న విచిత్రమైన కొత్త నిబంధన మాత్రం ఉంది" అన్నాడు రామారావు.

"ఆశ్చర్యంగా వుందే!" కనుబొమలు చిట్లించాడు కృష్ణ.

"అసలు యీ రాజకీయం అంటే మీ ఉద్దేశం?" హఠాత్తుగా అడిగాడు రామారావు!

కృష్ణ మరో సిగరెట్ వెలిగించాడు. ఒక దమ్ములాగి పొగ గాలిలోకివదులుతూ అన్నాడు.

"'రా' అంటే రావణాసురుల్నీ, 'జ' అంటే జరాసంధుల్నీ, 'కీ' అంటే కీచకుల్నీ, 'య'మగ్జంటుగా యీభూమ్మీదకు దింపడం! వారికంటే నీచమైన, నికృష్టమైన, హీనమైన, హేయమైన పనులుచేసి వారినే మరిపించడం!"

"చక్కగాచెప్పారు" అన్నాడు రామారావు.

మరి కొంత సేపయినాక "మరి వస్తానండీ" అంటూ లేచాడు రామారావు.

"మీరు రేపు రండి. మీ కథ మీద నా అభిప్రాయం చెప్తాను" అన్నాడు కృష్ణ.

అతను వెళ్ళిపోయాక ఆ కథ కాగితాలు తీసి చదవడం ప్రారంభించాడు కృష్ణ.

* * *


నూతన యవ్వనం పొందండి. సంతానవంతులు కండి! చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి హస్తప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము, అంగము చిన్నదగుట అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు. ప్రతి ఆదివారము భీమవరం షణ్ముఖ లాడ్జి నందు ఉ. 9 నుండి సా. 6-30 వరకు క్యాంపు కలదు.

**డా॥ డి. మార్కండేయులు**
ఆయుర్వేద భిషక్,
సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్టు,
పామర్రు రోడ్డు, గుడివాడ, 521301,
ఫోన్స్: 522 & 540



*1982 లో*
మీ అదృష్టం

ఒక పోస్టు కార్డుపై మీకు బాగా ఇష్టమైన పువ్వు పేరు వ్రాసి పంపితే నేను రాబోయే పన్నెండు నెలలలోను మీ ఉద్యోగం, ఆరోగ్యం, ఐశ్వర్యం, వివాహం, భార్య, పిల్లలు, ప్రేమ కలాపాలు, లాటరీ అన్ని ఒడిదుడుకులను గురించి సంవత్సర ఫలం వ్రాసి రూ. 2.25 లకు వి. పి. ద్వారా పంపుతాము. పోస్టేజి అదనం, దుష్టగ్రహ దోషం తొలగించబడుతుంది. మీకు పూర్తి సంతృప్తి.

**SRI KRISHNA JYOTISH, ASHRAM, (WAM), KARTARPOR-144801 (Pb.)**

FREE! ఉచితం! FREE!

ఎవర్ సిల్వర్ పాత్రలు ఉచితం!

ఈ క్రింది పటముల్లో చూపించిన ఏదో ఒక ఎవర్‌సిల్వర్ పాత్రను మీరు ఉచితంగా పొందవచ్చును. విశదంగా వివరాలు కావాలంటే వెంటనే ఉచిత కేటలాగు కొఱకు వ్రాయండి!




నమ్మకమూ, విశ్వాసమూ ఉంచదగినయీ మేరీ ఎంటర్‌ప్రైజెస్ బహుకాలంగా ప్రఖ్యాతి వహించిన మేరీ గోల్డు కవరింగ్ వర్క్స్ వారి అనుబంధ సంస్థ. గోల్డు కవరింగు నగలను 30 సంవత్సరాలుగా మేరీ గోల్డు కవరింగు వర్క్స్ తయారించుచున్నదను విషయం మీకు తెలిసినదే! నేడే వివరాలకు వ్రాయండి!

**MERI ENTERPRISES**

P.B. No. 1446. 14, RANGANATHAN STREET, T.NAGAR, MADRAS-600 017.

# రాజకీయం అంటే?

ఆమె మనసు రోదిస్తూంది- మూగగా!
ఆమె ఎద రగులుతోంది- సెగగా!
ఆమెలో ఏదో విరిక్తత!
అన్నీ ఉన్నా ఏదో నిస్పృహాయత!
ఆమె హృదయం—ఓ సాగరం!
ఆ హోరు, జోరు ఆమెకే పరిమితం!

దానికి కారణం—ఆమె రెండవ కొడుకు-సంజీవరావు హఠాన్మరణం!

ఆమె పేరు శ్రీమతి భారతీదేవి-'ఇందిరా ఎంటర్‌ప్రైజెస్' కంపెనీకి మకుటం లేని మహారాణి!

ఆమె శత్రువులకు సింహస్వప్నం!
మిత్రులందరికీ అభయ హస్తం!

ఆమె ఎవరిని అందలం ఎక్కిస్తుందో — ఎవరిని కాలి కిందేసి తొక్కేస్తుందో ఆ దేవ దేవుడికి కూడా తెలీదు!

ఆమె కంపెనీకి కారులో వెళ్తుంది. ఆ కారు శబ్దం ఆ 'వర్కర్ల' గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంది!

ఆమె వెనకాతల ఏన్ని అనుకున్నా, ఆమె ముఖం ముందు మాత్రం పిల్లులై పోతారు.

అలాంటి ఆమెను అశనిపాతం లాంటి చావు వార్త కదిలించి వేసింది! ఆమె ఆశల్ని కూకటి వ్రేళ తో కూల్చిపారేసింది! గతం కళ్ల ముందు మెరిసింది!

"... భారతీ దేవి జీవితం ఓ పూల పాన్పు! వడ్డించిన విస్తరి! ఆమె జీవితంలో చెప్పుకోదగ్గ కష్టాలూ, కడగండ్లూ లేవు. ఆమె తండ్రికి ఏకైక కుమార్తె. 'ఇందిరా ఎంటర్‌ప్రైజెస్'కు ఏకైక వారసురాలు. పెళ్లయిన కొద్ది కాలానికే అనుకోకుండా భర్త గుండె పోటుతో మరణించాడు. అయినా గుండె రాయి చేసుకుంది. తరువాత తండ్రి మరణం ఆమెను మరింత కృంగదీసింది. అప్పటికే ఆమె చుట్టూ చేరిన అనుచరుల సలహా మేరకు కంపెనీ బాధ్యతల్ని హస్తగతం చేసుకుంది. వర్కర్ల ఆందోళనల్ని, సమ్మెల్ని సామదాన భేద దండోపాయాలతో అణచి వేసింది. తన కంటూ ఓ ప్రత్యేకత ఏర్పరుచుకుంది.

ఓ పదేళ్ళిలా గడిచాయి. కాని యింతలో తన దాయాదులు రంగ ప్రవేశం చేసి ఆ కంపెనీలో తమకూ వాటాలున్నాయని

**కొ ణా లు !**

చదువనే రోజులలో
నేర్చుకునేవి —
లెక్కలలో అంబకోణాలు...
వదవనే రోజులలో
నేర్చుకునేవి —
లెక్కలలో కుంభకోణాలు !

— వివి. ఆర్. సత్యనారాయణమూర్తి

హైకోర్టులో కేసు పెట్టి గెలిచారు! ఇది ఆమె మొదటి ఓటమి!

అయినా ఆమె చలించలేదు. సుప్రీం కోర్టుకి 'అపీల్' చేసింది తన ముఖ్య ప్రత్యర్థులైన మురారి, రణధీర్, జీవనరావుల మధ్య తగవులు పెట్టింది! మురారి మొండి మనిషి! రణధీర్ అహంభావి! జీవనరావు అసమర్థుడు! ఈ బలహీనతల నాధారంగా సుప్రీంకోర్టులో వారు విభిన్నమైన సాక్ష్యాలిచ్చారు. దాంతో కేసు బలహీనపడి, భారతీదేవి కనుకూలంగా 'తీర్పు' వచ్చింది! మళ్ళీ కంపెనీ అధికారం తన 'హస్తగత' మైంది! ఈ కోర్టు వ్యవహారాల్లో తన రెండవ కొడుకు సంజీవరావు దిట్ట! తన అనుచరులతో అల్లకల్లోలం సృష్టించి తన కెంతో అండగా నిలిచాడు. నిజానికి అతని సలహాదారులూ, మిత్ర బృందాలూ లేకపోతే తన కేసు పోయి వుండేది. అలాంటి కొడుకు మూడు రోజుల క్రితం కారు 'రేష్'గా 'డ్రైవ్' చేస్తూ ఒక చెట్టుకు గుద్దించి యాక్సిడెంట్‌లో చనిపోయాడు! అది తనకి పెద్ద దెబ్బ!

అందుకే ఆ నిర్లిప్తత!
అందుకే ఆ నిస్సహాయత!
అయినా ఆమె చలించ లేదు!

పెళ్ళి చేసికొని తన భార్యతో ఢిల్లీలో ఉంటున్న తన పెద్ద కొడుకు రాజారావుని రప్పించింది! అతని ఉద్యోగానికి రాజీనామా ఇప్పించింది! తనకి అండగా కంపెనీ వ్యవహారాలు చూడమంది! నిజానికి అతనికి వ్యవహారాలు కొత్త! సంజీవరావులో ఉన్న దురుసు తనం, గడుసుతనం రాజారావులో లేవు! అయినా ప్రస్తుత పరిస్థితుల్లో భారతీ దేవికి తన వాడంటూ ఓ మనిషి అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే తన వెనకాల ఓ వ్యూహం తన వారే తయారు చేస్తున్నట్లను మానంగా ఉంది!

రాజారావుకి ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో తెలుసుకునే తెలివి, తెలిసి కాస్త తక్కువ! అయినా అనుభవం జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఇలాగే సరిపెట్టు కుంటూ రోజులు యీడుస్తోంది. అయినా ఆమెలో ఏదో వెలితి! ఏదో లోపం!

ఆమెను అలా నడిపిస్తున్నదెవరో కాదు; ఆశ! రేపు మీద ఆశ! ఈ మిగిలిన ఒక్క కొడుకూ తన తరువాత "ఇందిరా ఎంటర్ ప్రైజెస్"కి అధినేత అవుతాడన్న ఒక్కగానొక్క ఆశ మాత్రమే!

* * *

ఆ మర్నాడు సాయంత్రం రామారావు కృష్ణ యింటికి వచ్చాడు. "కథ ఎలా ఉంది సార్?" ఇంట్లోకి వస్తూనే అడిగాడు రామారావు.

"వన్‌మినిట్, అరుణా రెండు కాఫీ పంపించు" అని లోపలికి కేకేశాడు కృష్ణ.

కాఫీలయ్యాక కృష్ణే కదిపాడు.

"సెటైర్ బాగానే ఉంది కానీ, అసలా కథ ఎందుకు రాసినట్టో అర్థం కాలేదు..." అంటూ అగి సిగరెట్ వెలిగించాడు కృష్ణ.

రామారావు ముఖం చిన్నబోయింది.

"పైగా ఆ ముగింపు అంత 'పకడ్బందీ'గా లేదు. ఈ కథ పోటీకి పంపితే బహుమతి వచ్చే అవకాశాలు చాల తక్కువని నా అభిప్రాయం. ఇంత నిర్మొహమాటంగా చెపుతున్నందుకు నన్ను క్షమించండి" అని ఆ కథ కాగితాలు రామారావు చేతిలో పెట్టాడు కృష్ణ.

రామారావు ఆ కాగితాలందుకుని మడిచి, జేబులో పెట్టుకుని 'మరి వస్తానండి' అంటూ బయటకొచ్చాడు. సైకిలెక్కేముందు జేబులోంచి ఆ కథ కాగితాలు తీసి ముక్కలు ముక్కలుగా చింపి, పక్కనే ఉన్న కాలవలో పారేశాడు. నిరాశగా సైకిల్ తొక్కుకుంటూ యింటి ముఖం పట్టాడు.

మరో రెండు నెలల తరువాత —

ఆ కొత్త వీక్లీ బహుమతులు ప్రకటిస్తూ ఆ పోటీలో గెల్చిన విజేతల ఫోటోలు ప్రచురించారు. మొదటి బహుమతి 'రాజకీయం అంటే?' అన్న కథ. రచయిత శ్రీ కృష్ణ!

గబ గబా ఆ కథ పేజీలు తీసి చదవాడు రామారావు. ఆ నాడు తను కృష్ణకు చూపించిన కథే కొద్దిగ అక్కడక్కడా మార్పులు చేయబడింది.

రామారావు కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి! పళ్ళు పట పట కొరికాడు — ఆ వేశంతో ఊగిపోయాడు! అమాంతం కృష్ణ గొంతు నులిమేద్దామన్నంత కోపంతో వాళ్ళింటికి బయలుదేరాడు. కాని-హఠాత్తుగా ఆ రోజు కృష్ణ తనకి 'రాజకీయం అంటే' చెప్పిన నిర్వచనం గుర్తొచ్చింది.

"రాస్కెల్! ఆ నాడు రాజకీయం గురించి చెప్పింది నా మీదే ప్రయోగించాడన్న మాట!" అనుకుంటూ పెదమదిరిగాడు రామారావు కసిగా!

